క్లుప్తంగా

నేడు మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

గంపలగూడెం: మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ లతీఫ్ అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల లోపు నామినేషన్లు స్వీకరణ, 12 గంటల వరకు నామినేషన్ పత్రాల స్క్రూటినీ, తదుపరి ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట లోపు నామినేషన్లు ఉప సంహరణ. తదుపరి మండల పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహించి కో-ఆప్షన్ సభ్యుని ఎన్నిక జరుగుతుంది. ఓటింగ్ అనంతరం లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యునిచే ప్రమాణ స్వీకారం చేయిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

నూజివీడు: పట్టణంలోని విస్సన్నపేట రోడ్డులో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కొప్పుల వెలమపేటకు చెందిన భార్యాభర్తలు కలిదిండి గోవింద్(48), రజని (38)లు ఉదయం 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై అన్నవరం వైపునకు వెళ్తుండగా అన్నవరంలోని పెంకు ఫ్యాక్టరీలో పనిచేసే ఒడిస్సాకు చెందిన రామచంద్ (28) తన ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి వేగంగా ఢీకొన్నాడు. ముగ్గురూ కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో రజనీ తలకు తీవ్ర గాయమైంది.

నేటి నుంచి దుగ్గిరాల బాలరావమ్మ తిరునాళ్ల



ఆగిరిపల్లి: తోటపల్లి దుగ్గిరాల బాలరావమ్మతల్లి మాఘపూర్ణిమ తిరునాళ్ల శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ జి.శ్రీనివాస్ తెలిపారు. ఆగిరిపల్లి, తోటపల్లి, కనసానపల్లి గ్రామాల్లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు తిరునాళ్ల జరుగుతుందన్నారు. తోటపల్లిలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో 3న పల్లకీ సేవ, 4న తోటపల్లిలో అమ్మవారి ప్రభ ఊరేగింపు, 5న పూలంగి సేవ, ఉయ్యాల సేవలు నిర్వహిస్తామన్నారు. ఆయా ఆలయాల్లో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కమిటీ సభ్యులు చెప్పారు. ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ ఎస్.చంటిబాబు తెలిపారు.

రేపటి నుంచి తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల



బొర్రగూడెం(మైలవరం): మండల పరిధిలోని బొర్రగూడెం గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల తిరునాళ్ల శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మోహనరావు తెలిపారు. శనివారం రంగుల మహోత్సవం, ఆదివారం కల్యాణోత్సవాన్ని ఆలయ పూజారి జాజుల తిరుపతమ్మ దంపతుల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చెలికాని వెంకట సత్య వరప్రసాద్ పాల్గొంటారని, భక్తులు పాల్గొనాలని కోరారు.

రెడ్డిగూడెంలో కంటి వైద్య పరీక్షలు



రెడ్డిగూడెం: రెడ్డిగూడెంలోని అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లెపాం లక్ష్మి కంటి సమస్యలతో బాధపడుతున్న 44 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 8 మందికి కంటి శుక్లాలు గుర్తించి విజయవాడలోని చైతన్య కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు చింతిరాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కంటి సమస్యల పట్ల అశ్రద్ధ చేయరాదన్నారు. సంఘ సెక్రటరీ చింతిరాల సావిత్రి, కోశాధికారి తాళ్లూరు ఝాన్సీ, సభ్యులు సగ్గుర్తి వెంకటరావమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



వడ్లమానులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని వడ్లమానులో ఆయన గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే ప్రతాప్ అన్నారు. అర్హులందరికీ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. గతంలో జన్మభూమి కమిటీలతో టీడీపీ వారికే పథకాలు అందేవని నేడా పరిస్థితి లేదని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లతో నేరుగా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటివద్దకే అందిస్తున్నామని వివరించారు.

ఇళ్లు వెంటనే నిర్మించుకోవాలి..

అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, వైఎస్సార్ చేదోడు, జగనన్న తోడు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలను అందిస్తు దేశంలోనే అగ్రస్థానంలో సీఎం జగన్ రాష్ట్రాన్ని నిలిపారని ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, ఉప సర్పంచ్ నల్లిబోయిన రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు రానిమేకల సత్యనారాయణ, ఎంపీపీ అనూష ఇసాక్, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు కుప్పాల నాగరాజు, రెడ్డి రామకృష్ణ, మాజీ సర్పంచ్ జలసూత్రం కృష్ణమూర్తి, తహసీల్దార్ ఉదయ్‌భాస్కరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి



కొండపల్లిలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీధర్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జగనన్న కాలనీలో లబ్ధిదారులు త్వరతిగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ ఆదేశించారు. కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, వీఓఏలు, మెప్మా, హౌసింగ్ సిబ్బందితో ఇళ్ల నిర్మాణాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కాలనీ లేఅవుట్లలో లబ్ధిదారులకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించి నిర్మాణ పనులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ, ఇంజినీరింగ్, హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల పరిధిలో గురువారం పింఛన్ల పంపిణీ ముమ్మరంగా కొనసాగింది. ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామాలతో పాటు కొండపల్లి మున్సిపాలిటీలో వైఎస్సార్ పింఛన్‌ల కానుక పంపిణీ వంద శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఇబ్రహీంపట్నంలో 4,726 మందికి గాను తొలిరోజు 4,080 మందికి పంపిణీ చేయగా, రెండోరోజు గురువారం మిగిలిన 646 మందికి పంపిణీ చేశామని ఎంపీడీఓ రామకృష్ణనాయక్ తెలిపారు. కొండపల్లి మున్సిపాలిటీలో 5,147 మందికిగాను తొలిరోజు 4,157 మందికి అందజేయగా మిగిలిన 990 మందికి గురువారం అందజేశామని కమిషనర్ పి.శ్రీధర్ తెలిపారు.

94 శాతం పెన్షన్ల పంపిణీ

తిరువూరు: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు గురువారం నాటికి 94 శాతం పూర్తి చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం 6,674 మంది పెన్షనర్లకు 6,322 మందికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నగదు అందజేశారన్నారు. మిగిలిన వారికి అందిస్తామని చెప్పారు.

మానవాళి మనుగడలో జలవనరులు కీలకం



పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మైలవరం: జలవనరులు మానవాళి మనుగడకు ఎంతో కీలకమని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం ప్రకృతి-ఎన్విరాన్‌మెంట్ క్లబ్, ఏపీసీటీఈ-ఎస్‌పీఐసీఈఎస్ ఆధ్వర్యంలో బి.టెక్, ఎంబీఏ విద్యార్థులకు చిత్తడి నేలల ప్రాముఖ్యత గురించి గురువారం పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నదులు ప్రాంతాల్లోనైనా సంవత్సరంలో అధిక కాలం నీరు నిలిచి ఉండి, లోతు తక్కువగా ఉండే ప్రదేశాలను చిత్తడి నేలలు అంటారన్నారు. జలవనరులను రక్షించుకోవడం మన బాధ్యత అని తెలిపారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, ఎలక్యూషన్‌పై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ఈఈఈ ప్రొఫెసర్ డాక్టర్ కేఆర్ఎల్ ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ యూసుఫ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రకృతి క్లబ్ మెంబర్స్ డాక్టర్ షాహిదా నిలోఫర్, డాక్టర్ వి. భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి ఎంపీడీఓగా వాణి



ఆగిరిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎంపీడీఓగా కె.వాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పోలవరం నియోజకవర్గం బుట్టాయగూడెం ఎంపీడీఓగా పని చేస్తూ అనారోగ్య కారణాలతో మూడు నెలల నుంచి సెలవులో ఉన్న ఆమె సాధారణ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. అందరికీ అందుబాటులో ఉంటూ, అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరు చేస్తానని వాణి చెప్పారు. అనంతరం అడవినెక్కలం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు.

ఉపాధి కూలీలు తగిన వేతనం పొందేలా పని చేయాలి



వినగడప చెరువులో కూలీలకు సూచనలిస్తున్న ఎంపీడీఓ పిచ్చిరెడ్డి

వినగడప(గంపలగూడెం): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలు రోజువారి తగిన వేతనం వచ్చేలా పనిచేయాలని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. మండలంలోని వినగడపలో అమృత సరోవర్ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న చెరువు పూడిక తీత, చెరువు కట్ట అభివృద్ధి పరచే పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే ప్రతి కూలీకి జాబ్‌కార్డు తప్పని సరిగా ఉండాలని, 18 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు పనిలో పాల్గొనే అవకాశం లేదన్నారు. పనికి హాజరైన వారి హాజరు మాత్రమే మస్టర్ రోల్‌లో ఉండాలని కూలీలకు సూచించారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీ పరిధిలో పంట కాలువల పూడిక తీత, చెరువుల అభివృద్ధి పనుల్లో 1,986 మంది కూలీలు పనిచేస్తున్నట్లు ఎంపీడీఓ చెప్పారు.

పంగిడి చెరువును అభివృద్ధి చేయాలి



పొందుగల శివారులోని పంగిడి చెరువు

పొందుగల(మైలవరం): పొందుగల గ్రామం శివారులోని పంగిడి చెరువును జలాశయంగా అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. మైలవరం మండలం పొందుగల గ్రామం శివారులోని పంగిడి అటవీ ప్రాంతంలో సహజ సిద్ధంగా ఏర్పడిన చిన్న చెరువును 1955లో అప్పటి ఎమ్మెల్యే య విశ్వేశ్వర రావు కూలీల సహాయంతో 120 ఎకరాలకు విస్తరింప జేశారు. గతంలో మైలవరం మెట్ట ప్రాంతం కావడంతో జొన్న, రాగి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలు వర్షపు నీటిపై ఆధార పడి రైతులు పంటలు పండించేవారు. ప్రస్తుతం ఈ చెరువు క్రింది సుమారు 800 ఎకరాలు భూములు సాగులో ఉన్నాయి. అంతేగాక ఒక్కసారి ఈ చెరువు పూర్తిగా నిండితే సుమారు 2, 3 సంవత్సరాలు పొందుగల ప్రాంతంలో సాగునీటి కొరత ఉండదు. అదే విధంగా ఈ చెరువులో సమృద్ధిగా నీరు నిలువ ఉంటే మైలవరం పరిసర ప్రాంతాల్లో భూగర్భజల శాతం పెరిగి, బోర్లు, బావులలో నీరు ఉంటుందని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పంగిడి చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతు జే.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంగిడి చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే రెండేళ్ల పంటలు పండించవచ్చన్నాడు. అలాగే చెరువులో నీరు నిలువ ఉంటే మైలవరం పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీటి శాతం పెరుగుతుంది.

వెయిట్ లిఫ్టర్‌కు అభినందన



భరత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మహబూబాషా తదితరులు

ఇబ్రహీంపట్నం: జాకీర్ హుస్సేన్ కళాశాల ఇంటర్ విద్యార్థి తెల్లబద్ద భరత్ అంతర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.మహబూబాషా తెలిపారు. కళాశాలలో భరత్‌ను గురువారం అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జగ్గయ్యపేట ఉక్కు కళావేదికలో గత నెల 30నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 158 కిలోల బరువు ఎత్తి స్వర్ణం సాధించాడన్నారు. గతంలో తమ కళాశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు మస్తాన్‌వలి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఉరుసు



కొండపల్లిలో గంధం ఊరేగింపు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని హజరత్ సయ్యద్ షాబుఖారీ బాబా దర్గా 426వ ఉరుసు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. మూడు రోజులు జరిగిన ఉత్సవాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు బాబాను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ బాబాను దర్శించుకున్నారు. మతగురువు మహ్మద్ ఆల్తాఫ్‌రజా కమిషనర్‌ను సత్కరించారు. చివరిరోజు ప్రత్యేక పూజలు, ఖురాన్ పఠనం, దీపారాధనతో ఉరుసు ఉత్సవాలు ముగిసినట్లు ఆల్తాఫ్‌రజా ప్రకటించారు. బుధవారం రాత్రి ముజావర్లు ఇంటి నుంచి బయలు దేరిన గంధం ఊరేగింపు పట్టణ పురవీధుల్లో వైభవంగా జరిగింది. రాజస్థాన్ బ్యాండ్ మేళం, ఒంటెలు, ఏనుగులతో ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ముస్లిం మత పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ కాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తున్న సిబ్బంది

నూజివీడు: స్థానిక ఎంప్లాయిస్ కాలనీలో వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ పర్యవేక్షించి ప్రత్యేక పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. కాలేజీ రోడ్డులో నివాసం ఉండే ముగ్గురు వ్యక్తులు డెంగీతో విజయవాడలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైస్ చైర్మన్ వెంటనే స్పందించి హుటాహుటిన పారిశుద్ధ్య సిబ్బందిని పిలిపించి ఈ రోడ్డులోని మురుగునీటి కాలువలను పరిశుభ్రం చేయించడంతో పాటు, చెత్త చెదారాన్ని తొలగింప చేసి బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు ఫాగింగ్ను చేయించారు. ఈ సందర్భంగా పగడాల మాట్లాడుతూ.. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వారానికొకసారి ప్రతి ఇంటిలో డ్రైడే పాటించాలన్నారు. పాత టైర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, మూతలు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ సంచులు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉండకుండా ధ్వంసం చేయాలన్నారు. శానిటేషన్ సెక్రటరీ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారులు

ముసునూరు: మామిడి పంట కాపాడుకోవడానికి తక్షణ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మామిడి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి రైతులకు సూచించారు. మండలంలోని ముసునూరు, వేల్పుచర్ల, చిల్లబోయినపల్లి మామిడి తోటలలో పూత దశలను సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం మామిడిలో పూత, పిందె దశలలో తేనె మంచు పురుగు నివారణకు, పండు ఈగ నివారణకు అవసరమైన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖాధికారి ఆర్.హేమ, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆగిరిపల్లి: అనారోగ్యంతో మనస్తాపం చెంది గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం ఆగిరిపల్లికి చెందిన పల్లగాని వాసుబాబు(30)కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన వాసుబాబుకు కిడ్నీలు దెబ్బతినడంతో కుటుంబ సభ్యులు వైద్యం చేయిస్తున్నారు. గత నెల 28న కుటుంబ సభ్యులందరూ కలిసి గ్రామంలో తిరునాళ్లకు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న వాసుబాబు మనస్తాపంతో మద్యంలో గడ్డి మందు కలుపుకుని తాగాడు. స్థానికుల సమాచారంతో అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు 108లో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వాసు బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాదరక్షల తయారీ కేంద్రంతో జీవనోపాధి



వెల్లటూరులో యూనిట్ స్థలాన్ని పరిశీలిస్తున్న రాజారావు తదితరులు

జి.కొండూరు: మండల పరిధి వెల్లటూరు గ్రామంలో పాదరక్షల తయారీ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షనీయమని ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం వ్యవస్థాపకుడు బుల్లా రాజారావు అన్నారు. వెల్లటూరు గ్రామంలో రూ.6 కోట్లతో నిర్మించనున్న పాదరక్షల తయారీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని ఆయన గురువారం పరిశీలించారు. రాజారావు మాట్లాడుతూ పాదరక్షల తయారీ కేంద్రాల ఏర్పాటుతో చర్మకారులకు జీవనోపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని చర్మకారులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బట్టపర్తి రాజు, వెల్లటూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగు రైతులకు రాయితీలు

విస్సన్నపేట: ఆయిల్ పాం సాగు చేస్తున్న రైతులకు పలు రాయితీలు ఇస్తున్నామని మండల ఉద్యాన అధికారి బి.నరేంద్రకుమార్ చెప్పారు. మండలంలో ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు గురువారం ఆయన పలు సూచనలు చేశారు. రైతులకు మొక్కకు రూ.195, హెక్టారుకు రూ.29 వేలు రాయితీ ఇస్తున్నామన్నారు. ఎరువులకు రూ.5,250 నాలుగేళ్ల పాటు ఇవ్వటంతో పాటు అంతర పంటగా వరి మినహా వేరే ఏ పంటసాగు చేసినా హెక్టారుకు రూ.5,250 చొప్పున నాలుగేళ్లు ఇస్తామని చెప్పారు. ఆసక్తి గల రైతులు ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు.

సచివాలయాల పరిశీలన



విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ, తాతకుంట్ల, విస్సన్నపేటలో మూడు సచివాలయాలను ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్నారు. సచివాలయం ద్వారా అందించే సేవలు ప్రజలకు సకాలంలో అందించాలని ఎంపీడీఓ తెలిపారు.

కోదండ రామాలయంలో ప్రతిష్ఠా కార్యక్రమాలు



తిరువూరు: స్థానిక శ్రీకోదండ రామాలయంలో పునర్నిర్మించిన ప్రధాన కలశాలకు యాగశాలలో వేదపండితులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన కలశారాధన, పంచ గవ్యాధివాసం, అధివాస హోమం, నవగ్రహారాధన, నవగ్రహ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు దివి ఉదయకుమారాచార్యులు పర్యవేక్షణలో పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ తెలిపింది.

నేడు కోదండ రామాలయంలో ప్రత్యేక అభిషేకాలు

మైలవరం: స్థానిక శ్రీకోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ అధ్యక్షుడు మణికొండ చిన వెంకటేశ్వరరావు తెలిపారు. మైలవరానికి చెందిన చారుగుండ్ల ప్రసాదు, వెల్వడం గ్రామస్తులు యేండూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల సహకారంతో పూజలు నిర్వహిస్తున్నామన్నారు.

పశువులకు బీమా చేయించుకోవాలి

చాట్రాయి: పశువులకు బీమా చేయించుకోవాలని కృష్ణా మిల్క్‌యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. కొత్తగూడెం గ్రామంలో పాల కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. పాడి రైతుల సంక్షేమానికి తపాలా బ్యాంకు సహకారంతో రూ.399కే రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. పాడి రైతుల పిల్లల పెళ్లిళ్లకు రూ.20 వేల బంగారు నాణేం ఇస్తున్నామని, పాడి రైతు చనిపోతే రూ.50 వేలు ఇస్తున్నామని చెప్పారు. యూనియన్ పాలక వర్గ సభ్యుడు బొట్టు రామచంద్రరావు, తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

వెల్వడం(మైలవరం): మండల పరిధిలోని వెల్వడం గ్రామంలో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకుడు దివంగత లకిరెడ్డి బాలిరెడ్డి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించినట్లు కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాస రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.25,000, రెండో, మూడు బహుమతులుగా రూ.15 వేలు, రూ.10 వేలు అందిస్తామన్నారు.